సాక్షి
నంద్యాల

ఆదివారం ı 21 ı జనవరి ı 2024



కేసీకి 159 క్యూసెక్కుల నీరు

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కర్నూలు నగర ప్రజల తాగునీటి అవసరాలకు కేసీ కాల్వకు 159 క్యూసెక్కుల నీరు విడుదల చేసినట్లు శనివారం అధికారులు తెలిపారు.



ఫ్లోరైడ్‌కు 'ఆర్‌వో' విరుగుడు

ఫ్లోరైడ్ బాధిత ప్రాంతాల్లో ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఆరో ప్లాంట్ల ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. 8లో▸



ఆసరా ముందస్తు సంబరాలు

కర్నూలు(అగ్రికల్చర్): వైఎస్సార్ ఆసరా నిధులు ఈనెల 23న విడుదలవుతుండటంతో ముందస్తు సంబరాలు నిర్వహిస్తున్నారు. నిధుల సమాచారాన్ని పొదుపు సంఘాల సభ్యులకు వివరిస్తున్నారు.

న్యూస్‌రీల్

ప్రశాంతంగా నవోదయ పరీక్ష



బనగానపల్లె పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న బనవాసి విద్యాలయ ప్రిన్సిపాల్ పద్మావతి

నంద్యాల(న్యూటౌన్): జవహర్ నవోదయ ప్రవేశ పరీక్ష శనివారం ప్రశాంతంగా ముగిసింది. ఈ సందర్భంగా బనవాసి జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ ఇ. పద్మావతి మాట్లాడుతూ.. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 22 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించామన్నారు. ఆరో తరగతిలో మొత్తం 80 సీట్ల ఉండగా.. 6,120 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని, 4,813 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 1,307 గైర్హాజరయ్యారని తెలిపారు. నంద్యాల, బనగానపల్లె పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసినట్లు చెప్పారు.

మద్దిలేటి స్వామి ఒక్క రోజు ఆదాయం రూ.4.26 లక్షలు



రూ. లక్ష విరాళం అందజేస్తున్న కర్నూలుకు చెందిన దాత మురళీ

బేతంచెర్ల: ఆర్ఎస్ రంగాపురం శివార్లలో వెలసిన శ్రీలక్ష్మీ గణమద్దిలేటి నరసింహస్వామి క్షేత్రానికి పుష్య మాసం శనివారం సందర్భంగా రూ. రూ.4.26 లక్షల ఆదాయం వచ్చింది. స్వామి, అమ్మవార్ల దర్శనార్థం తరలివచ్చిన భక్తుల వివిధ సేవలు నిర్వహించుకుని మొక్కులు చెల్లించడంతో రూ.4,26,281 ఆదాయం వచ్చినట్లు ఈఓ పాండు రంగారెడ్డి, చైర్మన్ రామచంద్రుడు తెలిపారు. ఆలయ అభివృద్ధికి కర్నూలు నగరానికి చెందిన అలవాల బాలయ్య, లక్ష్మీదేవమ్మల జ్ఞాపకార్థం కుమారుడు మురళీ మోహన్ రూ.1,00,101 విరాళంగా అందజేశారు. దాతకు తీర్థప్రసాదలు అందజేసి స్వామి వారి పట్టు వస్త్రంతో సత్కరించారు.

ఆకాశవాణి శ్రోతలకు మనవి

- 60 కి.మీ పరిధి మేర నంద్యాల ఆకాశ వాణి ప్రసారాలు

నంద్యాల(అర్బన్): నంద్యాల ఆకాశవాణి కేంద్రం ప్రసారాలు ఇక నుంచి 60 కి.మీ. పరిధి మేర ప్రసారం కానున్నాయని ఆ కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ జనరల్ సోమేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2012లో ప్రారంభమైన నంద్యాల ఆకాశ వాణి కేంద్రం 100 వాట్ పవర్‌తో 100.1 మెగా హెడ్జ్ ఫ్రీక్వెన్సీ మీద 12 కిలో మీటర్ల పరిధిలో విజయవాడ కేంద్రంగా ఎఫ్ఎం ప్రసారాలు ప్రారంభం అయ్యేవన్నారు. ఈ కేంద్రం ఫ్రీక్వెన్సీని 5కిలో వాట్‌గా పెంచుతూ శుక్రవారం దేశ ప్రధాన మంత్రి నరేంద్రమోదీ వర్చువల్‌గా ప్రారంభించారన్నారు. దీంతో సుమారు 60కిలో మీటర్ల పరిధిలోని నంద్యాల, వైఎస్సార్, ప్రకాశం, కర్నూలు జిల్లాలోని కొన్ని ప్రాంతాలకు ఆకాశవాణి ప్రసారాలు ప్రసారమవుతాయని తెలిపారు.

కొనసాగుతున్న కులగణన



చాబోలులో సర్వే చేస్తున్న సచివాలయ సిబ్బంది

నంద్యాల(అర్బన్): జిల్లాలో రెండు రోజు శనివారం కులగణన సర్వే కొనసాగింది. జిల్లాలో 9,279 క్లస్టర్లు ఉండగా అందులో శనివారం 5,552 క్లస్టర్లలో సర్వే నిర్వహించినట్లు డీఎల్‌డీఓ మురళీ కల్యాణి తెలిపారు. 44,984 ఇళ్లకు సంబంధించిన 92,818 మందికి సర్వే పూర్తి చేశామని, మొత్తం మీద ఇప్పటి వరకు 5.25 శాతం సర్వే పూర్తయ్యిందని, రాబోయే రోజుల్లో మరింత వేగవంతంగా సర్వే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

చరిత్రలో నిలిచేలా అభివృద్ధి

- వాటర్‌గ్రిడ్, చెరువులు నింపడం సువర్ణాధ్యాయం
- విద్య, వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు
- ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి



విద్యార్థుల వసతిగృహాన్ని ప్రారంభిస్తున్న ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, చిత్రంలో ఎంపీ పోచా, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి తదితరులు

డోన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఐదేళ్లలోనే చరిత్రలో నిలిచిపోయేలా ఉమ్మడి కర్నూలు జిల్లాను అభివృద్ధి చేశామని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. డోన్ పట్టణంలో ఐటీఐ కళాశాల విద్యార్థుల సౌకర్యార్థం రూ.11 కోట్ల వ్యయంతో నిర్మించిన వసతి గృహ సముదాయాన్ని శనివారం ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డితో మంత్రి ప్రారంభించారు. అనంతరం మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు అధ్యక్షతన జరిగిన సభలో మంత్రి బుగ్గన మాట్లాడుతూ అనతి కాలంలోనే డోన్ నియోజకవర్గ ప్రజల దాహార్తి తీర్చే వాటర్‌గ్రిడ్ పనులు పూర్తి చేయడం, హంద్రీ నీవా నీటితో చెరువులు నింపి ఆయకట్టును స్థిరీకరించడం ఓ సువర్ణాధ్యాయమన్నారు. రూ.351 కోట్ల ఖర్చుతో వాటర్‌గ్రిడ్ మొదటి దశ పూర్తి కావడంతో ఈ వారంలోనే బేతంచెర్ల మండలానికి నీటిని సరఫరా చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. మార్చి నాటికి ప్యాపిలి, డోన్ మండలాల్లోని ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీటిని గోరుకల్లు రిజర్వాయర్ ద్వారా అందిస్తామన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో సాగునీటి వనరులు లేని ప్రాంతమైన డోన్ నియోజకవర్గానికి రూ.224 కోట్లతో హంద్రీనీవా కాలువ నుంచి నీటిని 65 చెరువులకు మళ్లించి దాదాపు 10 వేల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించగలిగామన్నారు. చెరువులు నింపడం ద్వారా భూగర్భ జలాలు వృద్ధి చెంది బావులు, బోరుబావుల్లో నీరు సమృద్ధిగా ఉందన్నారు. రూ.40 కోట్లతో చేపట్టిన వంద పడకల ప్రభుత్వాసుపత్రితో పాటు రూ.16 కోట్లతో నిర్మించిన ఆధునిక కూరగాయల మార్కెట్‌ను కూడా ఈనెల 28వ తేదీన ప్రారంభిస్తున్నామన్నారు. ఒక్క డోన్ నియోజకవర్గంలోనే రూ. 100 కోట్లతో నాడు - నేడు కింద ప్రభుత్వ పాఠశాలలను ఆధునీకీకరించామన్నారు. విద్య, వైద్యం, ఉపాధి, రవాణా, నైపుణ్యాభివృద్ధి లాంటి అన్ని రంగాల్లో నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నిలపాలన్నదే తమ లక్ష్యమని బుగ్గన అన్నారు.

చదువంటే ఇంజనీరింగే కాదు..

ప్రతి ఒక్కరూ తమ పిల్లలు ఇంజినీరింగ్ కావాలనుకోవడం సరి కాదని మంత్రి బుగ్గన అన్నారు. అత్యున్నత ఉపాధి కోసం విద్యతో పాటు నైపుణ్యాభివృద్ధి సాధించి విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చునన్నారు. చక్కటి వాతావరణం, ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలలకు ఏమాత్రం తీసిపోని వీధంగా ప్రభుత్వ పాఠశాలలను రూ. వేల కోట్లను ఖర్చు చేసి ఆధునికీకరించామన్నారు. రానున్న కాలంలో విద్యార్థులకు ఉపాధికి ఉపయోగపడే విధంగా కొత్త కోర్సులను ఐటీఐలో చేర్చుతున్నామన్నారు. నియోజకవర్గంలో ఇప్పటికే పాలిటెక్నిక్, ప్రభుత్వ ఐటీఐ, వెటర్నటీ, షెపర్డ్ ట్రైనింగ్ సెంటర్, ఐటీడీఆర్ లాంటి కళాశాలలకు నూతన భవనాల నిర్మాణం పూర్తయిందన్నారు. డోన్ నియోజకవర్గంలో అగ్రికల్చర్, హార్టికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలను కూడా ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. దీని నిర్మాణం కోసం అధికారులు స్థల సేకరణ చేస్తున్నారని తెలిపారు.



సమావేశానికి హాజరైన ప్రజలు

మోసగాళ్లు వస్తున్నారు జాగ్రత్త..

ప్రజలకు మాయ మాటలు చెప్పి మోసగించేందుకు టీడీపీ నాయకులు వస్తున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బుగ్గన హెచ్చరించారు. టీడీపీ మేనిఫెస్టోలో పెట్టిన హామీలను గతంలో ఎందుకు అములు చేయలేక పోయారని చంద్రబాబును నిలదీశారు. ఏపీఎస్ ఆర్టీసీకి వివిధ వర్గాల కోసం ఇస్తున్న రాయితీలు, సబ్సిడీలు దండగా అని మనస్సులో మాట పుస్తకంలో పేర్కొన్న చంద్రబాబు నేడు బస్సుల్లో ఉచిత ప్రయాణం అంటూ మరోసారి మోసగించేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. బాబు హయాంలో నిరుద్యోగ భృతి, పసుపు కుంకుమ, రైతులకు రుణమాఫీ, డ్వాక్రా మహిళలకు రుణ మాఫీ హామీల్లో ఒక్కటైనా అమలు చేశారా అని ప్రశ్నించారు. ప్రతి కుటుంబానికి 3 సెంట్ల స్థలం ఎలా ఇస్తారో టీడీపీ నాయకులు చెప్పాలన్నారు.

బుగ్గన కృషి అభినందనీయం

డోన్ నియోజకవర్గం నుంచి ఎన్నికైన ఎమ్మెల్యేలు ఎంతో మంది ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రులైనా ఏమి చేయలేకపోయారని, మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి డోన్ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి కొనియాడారు. కర్నూలు నుంచి ఓర్వకల్లు మీదుగా బేతంచెర్ల వరకు కొత్త రైల్వేలైన్ ఏర్పాటుకు మంత్రి బుగ్గన కృషి చేస్తున్నారన్నారు. కేంద్రీయ విద్యాలయాన్ని సైతం డోన్‌లో ఏర్పాటు చేస్తుండటంతో నియోజకవర్గానికి ప్రత్యేక గుర్తింపు లభిస్తుందన్నారు. అంతకుముందు ప్రభుత్వ ఐటీఐలోని వసతి గృహాన్ని ఎంపీ పోచా, సమావేశ మందిరాన్ని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, కిచెన్ సెంటర్‌ను జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో టెక్నికల్ ఎడ్యుకేషన్ జాయింట్ డైరెక్టర్ సత్యనారాయణ, డీఈఓ సుధాకర్‌రెడ్డి, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ బద్దల రాజ్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ మల్లెంపల్లె రామచంద్రుడు, డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, వైఎస్ఆర్‌సీపీ పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు దొరపల్లె చిరంజీవి, కురుకుంద హరి, పార్టీ జిల్లా బీసీ విభాగం అధ్యక్షులు పోస్టుప్రసాద్, ఆర్అండ్‌బీ డీఈ ప్రసాద్‌రెడ్డి, ఏఈ శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

డోన్ ప్రజలు అదృష్టవంతులు..

గత ఎన్నికల సందర్భంలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి డోన్‌ను మోడల్ నియోజకవర్గంగా తీర్చుదిద్దుతానని మాటిచ్చి నిలబెట్టుకోవడం నియోజకవర్గ ప్రజలు చేసుకున్న అదృష్టమని జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. రూ.2,500 కోట్లతో రాష్ట్రంలోనే ఆదర్శంగా డోన్ నియోజకవర్గాన్ని మంత్రి బుగ్గన తీర్చిదిద్దారని ఆయన కొనియాడారు. విద్యా హబ్‌గా డోన్ మారుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాలకు రవాణా సౌకర్యాలు మెరుగు పడేలా జాతీయ రహదారులను అనుసంధానిస్తూ హైవేలు నిర్మించారన్నారు.



ప్రభుత్వ ఐటీఐ విద్యార్థుల వసతి గృహం ఏరియల్ వ్యూ



వసతి గృహం ముఖ ద్వారం



వసతి గృహంలో సమావేశ మందిరం

రైతులకు అండగా నిలుద్దాం

- జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వంగాల భరత్ కుమార్ రెడ్డి



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వంగల భరత్ కుమార్ రెడ్డి

నంద్యాల: జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో రైతులు నష్టపోకుండా అండగా నిలిచి ఆదుకోవాలని జిల్లా వ్యవసాయ మండలి చైర్మన్ వంగాల భరత్ కుమార్ రెడ్డి వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్‌తో కలిసి జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. సమావేశంలో మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి, వ్యవసాయ సలహా మండలి సభ్యులు రాజమోహన్‌రెడ్డి, వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భరత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితులతో అరు మండలాలను కరువు మండలాలుగా ప్రభుత్వం ప్రకటించిందన్నారు. రైతుల సాగు చేసిన పంటకు ఈ క్రాప్ బుకింగ్‌తో పాటు పెండింగ్‌లో ఉన్న ఈ కేవైసీని కూడా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. జిల్లాలో ఆయిల్ ఫామ్ సాగుకు ప్రభుత్వం అనుమతించిందని నర్సరీల్లో సంబంధిత ప్లాంటేషన్‌కు చర్యలు తీసుకోవాలన్నారు. సాగునీటి కాలువలు, మైనర్ ఇరిగేషన్ ట్యాంకుల పరివాహక ప్రాంతాలోని రైతులకు నీటి సౌకర్యం కల్పించి సాగైన పంటలను కాపాడేందుకు ప్రయత్నించాలని సంబంధిత అధికారులను కోరారు. ఇన్‌పుట్ సబ్సిడీ ప్రీమియంపై రైతుల్లో ఆందోళన ఉందని, ఈ అంశంపై పూర్తిస్థాయి అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ మాట్లాడుతూ రబీలో సాగు చేసుకున రైతులకు కరువు పరిస్థితులపై వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్లు, మండల వ్యవసాయ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే జొన్న పంట కొనుగోలు కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ సంవత్సరం ఖరీఫ్‌లో 9, రబీలో 6 రకాల పంటలకు క్రాప్ ఇన్సూరెన్స్ వర్తిస్తుందని, ఆర్బీకేల ద్వారా గ్రామ సభలు నిర్వహించి రైతులకు వివరించాలన్నారు. ఏఏ పంటలకు ఎంత ఇన్సూరెన్స్ వస్తుందనే అంశాలపై సంపూర్ణ అవగాహన కల్పించాలన్నారు. ప్రత్యామ్నాయ పంటలకు అవసరమయ్యే విత్తనాలను సిద్ధంగా ఉంచుకోవాలని ఏపీ సీడ్స్, మార్క్‌ఫెడ్ అధికారులకు సూచించారు. రైతులకు అవసరమయ్యే సూచనలు సలహాలు ఇచ్చేందుకు వ్యవసాయ శాఖ ఏడీఏలు, గ్రామ వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రావు, ఉద్యాన శాఖ అధికారి నాగరాజు పాల్గొన్నారు.

గిరిజన ఆశ్రమ పాఠశాలలకు బంకర్ బెడ్స్

కర్నూలు(అర్బన్): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని రెండు గిరిజన ఆశ్రమ పాఠశాలలు, ఒక ప్రీ మెట్రిక్ బాలుర వసతి గృహానికి ప్రభుత్వం బంకర్ బెడ్స్‌ను సరఫరా చేయనుందని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఎస్ శ్రీనివాసకుమార్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా బంకర్ బెడ్స్‌ను ఏర్పాటు చేసేందుకు అవసరమైన స్థలం ఉన్న పాఠశాలలను ఎంపిక చేసి పంపించాలని తమ శాఖ డైరెక్టరేట్ నుంచి ఆదేశాలు అందాయన్నారు. ఈ నేపథ్యంలో కర్నూలు జిల్లాలోని తుగ్గలి (బాలికలు), నంద్యాల జిల్లాలోని పాలెంచెరువు (బాలురు), నంద్యాలలోని ప్రీ మెట్రిక్ బాలుర వసతి గృహాన్ని ఎంపిక చేసి పంపించామన్నారు. తాము పంపిన నివేదికల ఆధారంగా తుగ్గలికి 50, పాలెంచెరువుకు 50, ప్రీ మెట్రిక్ బాలుర వసతి గృహానికి 50 బంకర్ బెడ్స్‌ను పంపిస్తున్నట్లు సమాచారం అందిందన్నారు. రెండు, మూడు రోజుల్లో బంకర్ బెడ్స్ ఆయా పాఠశాలలకు వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు.

రేపు 'స్పందన' రద్దు

నంద్యాల: స్థానిక కలెక్టరేట్‌లో ఈనెల 22వ తేదీ సోమవారం నిర్వహించాల్సిన 'జగనన్నకు చెబుదాం - స్పందన' కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అనివార్య కారణాల వల్ల ఈ కార్యక్రమాన్ని రద్దు చేశామని, ప్రజలు గమనించి రావొద్దని సూచించారు.

ఈనెల నుంచి ఉద్యోగుల పదవీ విరమణ

- 2022 జనవరిలో పదవీ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంపు

కర్నూలు(అగ్రికల్చర్): ప్రభుత్వ శాఖల్లో మళ్లీ ఈ నెల చివరి నుంచి పదవీ విరమణ సందడి నెలకొననుంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉద్యోగుల పదవీ విమరణ వయస్సు 2022 జనవరిలో 60 ఏళ్ల నుంచి 62 ఏళ్లకు పెంచింది. ఆ మేరకు సదరు ఉద్యోగులు ఈ నెల 31న పదవీ విరమణ పొందనున్నారు. ఇకపై ప్రతి నెలా ప్రభుత్వ శాఖల్లో పదవీ విమరణ కోలాహలం ఉండనుంది. ఉమ్మడి జిల్లాలో ఈ నెలలో దాదాపు 150 నుంచి 250 మంది వరకు ఉద్యోగులు పదవీ విరమణ చేయనున్నారు. ఉద్యోగుల రిటైర్‌మెంట్లు మొదలవుతుండగా.. ఇదే సమయంలో వివిధ శాఖల్లో ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం చర్యలు చేపట్టడం విశేషం.

శిశుగృహాలో పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు(అర్బన్): శిశు గృహాలో ఖాళీగా ఉన్న పోస్టులను కాంట్రాక్టు పద్ధతిన భర్తీ చేసేందుకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ పీడీ వెంకటలక్షుమ్మ శనివారం పేర్కొన్నారు. సోషల్ వర్కర్ కమ్ ఈసీఈ, ఆయా (3), చౌకీదార్, జువైనల్ జస్టిస్ బోర్డు (జేజేబీ)లో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ కమ్ డేటా ఎంట్రీ ఆపరేటర్, పోషణ్ అభియాన్ పథకంలో ఖాళీగా ఉన్న జిల్లా ప్రాజెక్టు అసిస్టెంట్ ఉద్యోగాల నియామకాలకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 22 నుంచి 29వ తేదీ లోగా కలెక్టరేట్‌లోని స్త్రీ శిశు సంక్షేమ శాఖా కార్యాలయంలో అందించాలన్నారు.

రిపబ్లిక్ వేడుకలు ఘనంగా నిర్వహిద్దాం

- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్



మాట్లాడుతున్న కలెక్టర్ జిలానీ, చిత్రంలో ఎస్పీ రఘువీర్‌రెడ్డి, జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

నంద్యాల: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఈనెల 26వ తేదీన రిపబ్లిక్ వేడుకలను ఘనంగా చేపట్టేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ జిల్లా అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో గణతంత్ర వేడుకల ఏర్పాట్లపై జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డితో కలిసి కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నంద్యాల పట్టణంలోని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఇప్పటి నుంచే ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కళాశాల మైదానాన్ని ఆకర్షణీయమైన రీతిలో తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జాతీయ పతాకావిష్కరణ, సాయుధ దళాల మార్చ్ ఫాస్ట్, వేదిక, బ్యాక్ డ్రాప్, వీఐపీ సీటింగ్ తదితర ఏర్పాట్లపై ప్రత్యేక చొరవ చూపాలని ఆర్‌డీఓ, పోలీసు అధికారులకు సూచించారు. దేశభక్తి ఉట్టిపడేలా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. నవరత్నాల అభివృద్ధి కార్యక్రమాలు ప్రతిబింబించేలా వ్యవసాయం, డీఆర్‌డీఏ, హౌసింగ్, వైద్యం, డ్వామా, వ్యవసాయ అనుబంధ రంగాలు, సంక్షేమం తదితర శాఖలు అభివృద్ధి కార్యక్రమాలపై ఏర్పాటు చేసే శకటాల ప్రదర్శన అందరినీ ఆకట్టుకునేలా ఉండాలన్నారు. అలాగే ఆయా శాఖలు ఎగ్జిబిషన్ స్టాళ్లను ఆకర్షణీయంగా ఏర్పాటు చేయాలన్నారు. జనవరి 26వ తేదీ నిర్వహించే గణతంత్ర వేడుకల్లో జిల్లా ప్రజలు, పాఠశాల విద్యార్థులు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. గత స్వాతంత్ర, గణతంత్ర దినోత్సవ వేడుకల్లో తలెత్తిన సూక్ష్మలోపాలను దృష్టిలో ఉంచుకొని ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా వేడుకలను విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో హౌసింగ్ పీడీ వెంకటసుబ్బయ్య, ఆర్డీవో శ్రీనివాసులు, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్ రెడ్డి, డ్వామా పీడీ రామచంద్రారెడ్డి, డీఎంహెచ్ఓ వెంకటరమణ, డీఈఓ సుధాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

252 ఏహెచ్‌ఏ పోస్టుల భర్తీకి రంగం సిద్ధం

- ఈ నెల 22, 23 తేదీల్లో సర్టిఫికెట్ల వెరిఫికేషన్
- 24, 25 తేదీల్లో నియామకపు పత్రాలు

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో 252 అనిమల్ హజ్బెండరీ అసిస్టెంటు(ఏహచ్‌ఏ) పోస్టుల భర్తీకి రంగం సిద్ధమైంది. పోస్టుల భర్తీలో భాగంగా వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం ఇటీవల నోటిఫికేషన్ ఇవ్వడం, ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించడం పూర్తయింది. మూడు రోజుల క్రితం మెరిట్ లిస్ట్ శనివారం జిల్లాకు చేరింది. ఉమ్మడి జిల్లా యూనిట్‌గా కర్నూలు కేంద్రంగా ఈనెల 22, 23 తేదీల్లో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియ కలెక్టరేట్‌లోని పశుసంవర్ధక శాఖ కార్యాలయంలోనే చేపట్టనున్నారు. ఇందుకోసం జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ రామచంద్రయ్య నాలుగు టీమ్‌లను ఏర్పాటు చేశారు. ఈ నెల 24, 25 తేదీల్లో నియమాక పత్రాలు అందజేస్తారు. అయితే ఫిబ్రవరి మొదటి వారంలోనే ఏహెచ్‌ఏలకు పోస్టింగ్ ఉత్తర్వులు ఇవ్వనున్నారు. ఇకపోతే జిల్లా పశుసంవర్ధక శాఖకు సంబంధించి కర్నూలు జిల్లాలో 190, నంద్యాల జిల్లాలో 193 క్లస్టర్లను ప్రభుత్వం నోటిఫై చేసింది. ప్రస్తుతం ఏహెచ్‌ఏలుగా పనిచేస్తున్న వారి బదిలీలకు కూడా ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఈ నెల చివరిలోగా ప్రక్రియను పూర్తి చేసి.. ఫిబ్రవరి 1 తర్వాత కొత్త ఏహెచ్‌ఏలకు పోస్టింగ్‌లు ఇవ్వనున్నారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టనున్నట్లు జాయింట్ డైరెక్టర్ రామచంద్రయ్య తెలిపారు.

క్లుప్తంగా

పరిసరాల పరిశుభ్రతతోనే ప్రశాంతత



కాన్ఫరెన్స్ హాల్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ డాక్టర్ జి.సృజన

కర్నూలు(సెంట్రల్): కార్యాలయ పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే పని చేయాలనే ఆసక్తి కలుగుతుందని, ఇదే సమయంలో ప్రశాంతత చేకూరుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన అన్నారు. శనివారం ఆర్‌డీఓ కార్యాలయంలో రూ.24 లక్షలతో ఆధునీకరించిన కాన్ఫరెన్స్ హాలును ఆమె జేసీ నారపురెడ్డి మౌర్యతో కలసి ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్యాలయాల ఆధునీకరణకు నిధులను సమకూరుస్తున్నట్లు చెప్పారు. ఆర్‌డీఓ కార్యాల య కాన్ఫరెన్స్ హాలును కార్పొరేట్ హంగులతో ఆధునికీకరించిన ఆర్‌డీఓ హరిప్రసాదును కలెక్టర్ అభినందించారు. కార్యాయాలను శుభ్రంగా ఉంచుకునే విషయంలో ఉద్యోగులు బాధ్యతగా మెలగాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో కె.మధుసూదనరావు, డీఎస్పీ సుధాకరరెడ్డి,తహసీల్దార్లు శివరాముడు, రమేష్‌బాబు, విజయశ్రీ, శివప్రసాదురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తుల చెంతకు భగవంతుడు



పల్లకీలో జ్వాలా నరసింహుడు, ప్రహ్లాదవరదుడు

ఆళ్లగడ్డ: పార్వేట మహోత్సవాల్లో అహోబిలేశుడి ఉత్సవ పల్లకీ శనివారం రూరల్ కోటకందుకూరు గ్రామంలో కొలువుదీరింది. జ్వాలనరసింహ స్వామి, ప్రహ్లాదవరదస్వాములను గ్రామస్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

27లోపు పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పన

కర్నూలు(సెంట్రల్): అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఈనెల 27వ తేదీలోపు మౌలిక వసతులు కల్పించాలని అధికారులను జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశించారు. శనివారం మధ్యాహ్నం ఆమె కలెక్టరేట్‌లోని క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా అధికారులు, మండల ప్రత్యేకాధికారులు, ఎంపీడీఓలతో కులగణన, ఎన్నికల అంశాలపై టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈనెల 22న తుది ఓటరు జాబితాను ప్రచురిస్తున్నామని, ఈ జాబితాను అన్ని పోలింగ్ స్టేషన్లలో అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. తహసీల్దార్లు, ఎంపీడీఓలకు కూడా ప్రచురణ జాబితాలను అందజేయాలన్నారు. టెలికాన్ఫరెన్స్‌లో జేసీ నారపురెడ్డి మౌర్య, కర్నూలు నగర పాలక సంస్థ కమిషనర్ భార్గవ్‌తేజ, ఆదోని సబ్ కలెక్టర్ శివనారాయణ శర్మ, కర్నూలు, పత్తికొండ ఆర్‌డీఓలు హరిప్రసాదు, రామలక్ష్మి, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి పాల్గొన్నారు.

ఫ్లోరైడ్‌కు 'ఆర్‌వో' విరుగుడు

- బాధిత ప్రాంతాల్లో ఆరో ప్లాంట్ల ఏర్పాటుకు చర్యలు
- ప్రతిపాదనలు పంపిన అధికారులు
- బాధితులకు వైద్యపరీక్షలు, చికిత్స





బాలిక దంతాలను పరీక్షిస్తున్న వైద్యులు (ఫైల్), వృద్ధురాలి కాళ్లను పరిశీలిస్తున్న ఆశా కార్యకర్త (ఫైల్)

కర్నూలు(హాస్పిటల్): ఫ్లోరైడ్ బాధిత ప్రాంతాల్లో ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఆరో ప్లాంట్ల ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. జిల్లాలో 4,242 చేతిపంపులు ఉన్నాయి. అలాగే 801 ప్రొటెక్టెడ్ వాటర్ సప్లయ్, 905 మినీప్రొటెక్టెడ్ వాటర్ సప్లయ్, 152 డైరెక్టర్ పంపింగ్, 32 కాంప్రెన్సివ్ ప్రొటెక్టివ్ వాటర్ సప్లయ్ ద్వారా గ్రామాల్లోని ప్రజలకు రక్షిత తాగునీటిని సరఫరా చేస్తున్నారు. ఈ నీటిని పరీక్షించేందుకు కర్నూలు, ఆదోని, ఆలూరులలో పరీక్ష కేంద్రాలు ఉన్నాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం జిల్లాలోని 721 నివాసిత ప్రాంతాల్లో 15,37,960 మంది నివసిస్తున్నారు. నేషనల్ ప్రోగ్రామ్ ఫర్ ప్రీవెన్షన్ అండ్ కంట్రోల్ ఫ్లోరోసిస్ కింద జిల్లాలో ఫ్లోరైడ్ ప్రభావిత గ్రామాల్లో వైద్య ఆరోగ్యశాఖ గత నాలుగేళ్లుగా పరీక్షలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా 106 ప్రాంతాల్లో ఫ్లోరైడ్ ఉన్నట్లు నిర్ధారించారు. 107 గ్రామాల్లోని పాఠశాలల్లో విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించి 400లకు పైగా చిన్నారులు ఫ్లోరోసిస్ బారిన పడినట్లు నిర్ధారించారు. వ్యాధికి గురైన పిల్లలు, పెద్దలకు ఉపకరాలు, చేతికర్రలు ఇవ్వడం, చిన్నారులకు దంతచికిత్సలు చేస్తున్నారు.

తాగునీరు, ఆహారంలో ఫ్లోరైడ్

జిల్లాలోని ఆదోని, ఆలూరు, ఆస్పరి, సి. బెళగల్, చిప్పగిరి, దేవనకొండ, గూడూరు, హొళగుంద, కల్లూరు, కోడుమూరు, కృష్ణగిరి, కర్నూలు, మంత్రాలయం, ఓర్వకల్లు, పత్తికొండ, తుగ్గలి, వెల్దుర్తి, ఎమ్మిగనూరు మండలాల్లో ఫ్లోరైడ్ ప్రభావం ఉంది. తాగునీటితో పాటు పలు ఆహార పదార్థాల్లోనూ ఫ్లోరైడ్ పరిమాణం 1.5 పీపీఎం కంటే అధికంగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. నల్లఉప్పులో పీపీఎం అధికంగా ఉంటుందని, ఇది ఫాస్ట్‌ఫుడ్, జంక్ ఫుడ్, ప్యాకేజ్డ్ ఫుడ్స్, హోటళ్లు, రెస్టారెంట్లలలో అధికంగా కలుపుతున్నట్లు గమనించారు.

నివారణ చర్యలు ఇలా..

జిల్లాలోని ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాల్లో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు నివారణ చర్యలు ప్రారంభించారు. ఆయా ప్రాంతాల్లోని పాఠశాలల్లో ఉన్న ఫ్లోరోసిస్ లక్షణాలున్న విద్యార్థులను గుర్తించి వారికి వ్యాధినిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు. వ్యాధి నిర్ధారణ అయిన వారికి అవసరమైన మందులు అందజేస్తున్నారు. ఇతరులకు ఫ్లోరోసిస్ రాకుండా ఉండేందుకు రక్షిత మంచినీటి ఎలా తాగాలో అవగాహన కల్పిస్తున్నారు. ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాల్లో ఆర్‌వో ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదించారు.

ప్రతిపాదనలు పంపించాం

ఎక్కువగా విద్యార్థులు, వృద్ధుల్లో ఫ్లోరోసిస్ లక్షణాలు కనిపిస్తున్నాయి. విద్యార్థుల్లో లక్షణాలు గుర్తించి వారికి చికిత్స చేస్తున్నాం. ప్రభావిత ప్రాంతాల్లో ఆర్‌వో ప్లాంట్లు ఏర్పాటు చేయాలని ఇప్పటికే ప్రతిపాదనలు పంపించాం.

–డాక్టర్ సుధాకర్, ఫ్లోరోసిస్ కన్సల్టెంట్, కర్నూలు

అతివేగంతోనే రోడ్డు ప్రమాదాలు



ఆటోకు రేడియం స్టిక్కర్ అతికిస్తున్న దృశ్యం

ఓర్వకల్లు: అధిక శాతం రోడ్డు ప్రమాదాలకు అతివేగమే కారణమని జిల్లా అదనపు ఎస్పీ నాగరాజు అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా శనివారం మండలంలోని నన్నూరు టోల్ ప్లాజా వద్ద వాహనదారులకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కర్నూలు–కడప జాతీయ రహదారి ప్రాజెక్టు ప్రతినిధులు మదన్‌మోహన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సదస్సులో అదనపు ఎస్పీతో పాటు, కర్నూలు డీఎస్పీ విజయశేఖర్, రూరల్ సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ వాహనదారులు రోడ్డు భద్రతా నిబంధనలను తప్పక పాటించాలన్నారు. ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. విధిగా లైసెన్స్‌ను కలిగి ఉండాలన్నారు. ఆటో డ్రైవర్లు వ్యతిరేక మార్గాలలో ప్రయాణించడం ప్రమాదకరమన్నారు. కార్లలో ప్రయాణించేవాళ్లు సీటు బెల్టు ధరించడంతో పాటు నిర్ణీత వేగాన్ని మించి నడుపరాదన్నారు. అనంతరం వాహనాలకు రేడియం స్టిక్కర్లను అతికించారు.కార్యక్రమంలో ప్రాజెక్టు నిర్వహణాధికారి గౌరి నాయుడు, రూట్ ఆఫీసర్ కటారుకొండ రంజిత్‌రెడ్డి, టోల్‌ప్లాజా మేనేజర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రహదారి భద్రతా మాసోత్సవాలను జయప్రదం చేయండి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ జిలానీ, ఎస్పీ రఘువీర్‌రెడ్డి, జేసీ రాహూల్ కుమార్‌రెడ్డి, డీటీసీ శివారెడ్డి

నంద్యాల(న్యూటౌన్): జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలను జయప్రదం చేయాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ పేర్కొన్నారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1988 సెక్షన్ 129 ప్రకారం ద్విచక్ర వాహనదారుడు, వెనుక కూర్చున్న వ్యక్తి హెల్మెట్ తప్పకుండా ధరించాలన్నారు. రహదారి ప్రమాదాల్లో కాపాడుకునేందుకు హెల్మెంట్ ధరించి ప్రాణాలను కాపాడుకొని కుటుంబాలను రక్షించుకోవాలన్నారు. నిత్యం రోడ్డు ప్రమాదాల్లో 24 శాతం చనిపోతున్నారని, జిల్లా వ్యాప్తంగా 2023లో 1,029 ప్రమాదాలు జరిగితే 519 మంది చనిపోగా 1,207 మంది క్షతగాత్రులయ్యారన్నారు. బాధితులు ఎక్కువ శాతం హెల్మెట్ ధరించని వారేనన్నారు. అనంతరం డీటీసీ శివారెడ్డి మాట్లాడుతూ సుప్రీంకోర్టు కూడా ద్విచక్రవాహనదారులందరూ హెల్మెట్‌ను తప్పని సరిగా ధరించే విధంగా చట్టాన్ని అమలు చేయాలని, అన్ని జిల్లాలను ఆదేశించడం జరిగిందని తెలిపారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు ఫిబ్రవరి 19వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి, ఎస్పీ రఘువీర్ రెడ్డి, ఎంవీఐలు, రోడ్డు భద్రత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మద్యం అక్రమ రవాణాపై ఉక్కుపాదం



పట్టుకున్న మద్యాన్ని చూపుతున్న డీఎస్పీ శివనారాయణస్వామి, పోలీసులు

ఆదోనిరూరల్: మద్యం అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నట్లు ఆదోని డీఎస్పీ శివ నారాయణస్వామి తెలిపారు. కర్ణాటక రాష్ట్రం సిరుగుప్ప నుంచి అక్రమంగా కర్ణాటక మద్యం బాక్సులను తరలిస్తున్న ఇద్దరిని శనివారం ఆదోని పట్టణ శివారులోని మదిరె క్రాస్ వద్ద అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. ఆదోని పట్టణం బోయగేరికి చెందిన రామయ్య, అరుంజ్యోతినగర్‌కు చెందిన బందారి చిన్నా.. మోటార్ సైకిల్‌పై మద్యం తరలిస్తూ పట్టుబడ్డారన్నారు. వారి వద్ద నుంచి 22 మద్యం బాక్సులు (2,112) టెట్రా ప్యాకెట్లను, మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు చెప్పారు. దాడుల్లో రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి, ఇస్వీ ఎస్‌ఐ శ్రీనివాసులు, హెడ్ కానిస్టేబుల్ నాగరాజు, కానిస్టేబుళ్లు సుదర్శన్, అశోక్, కిరణ్‌కుమార్, పెద్దతుంబళం కానిస్టేబుల్ సుధాకర్ పాల్గొన్నారు.

చిన్నారులకు తప్పకుండా టీకాలు వేయాలి



చిన్నారికి టీకా వేస్తున్న సిబ్బందికి సూచనలు చేస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): చిన్నారులకు, గర్భిణులకు తప్పనిసరిగా టీకాలు వేయాలని జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ చెప్పారు. శనివారం స్థానిక శ్రీరామనగర్‌లోని యూపీహెచ్‌సీ పరిధిలో ఉన్న బైపిస్ట్ కాలనీ సచివాలయంలో వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బర్త్ ప్లానింగ్‌లో భాగంగా గర్భిణులను ప్రసవం కోసం ఏ ఆసుపత్రికి వెళ్లాలనే విషయాన్ని ముందుగానే కుటుంబసభ్యులతో చర్చించి ఓ నిర్ణయం తీసుకోవాలన్నారు. గర్భిణులకు పౌష్టికాహారం గురించి అవగాహన కల్పించాలని చెప్పారు. అనంతరం ఆయన గర్భిణులకు ఐరన్ మాత్రలు, బరువు, ఎత్తు తక్కువ ఉన్న పిల్లలకు ఐఎఫ్‌ఏ, విటమిన్–ఎ సిరప్ పంపిణీ చేశారు. ఆయన వెంట డీసీఎం ప్రసాద్, ఏఎన్‌ఎం, ఆశాలు ఉన్నారు.

ఒక్క రోజులోనే ఆధునికీకరణ పనులు పూర్తి

- వ్యవసాయానికి పగటిపూట మరింత నాణ్యమైన విద్యుత్ ఇచ్చే అవకాశం



ఆధునీకరణ పనులను పర్యవేక్షిస్తున్న ట్రాన్స్‌కో అధికారులు

కర్నూలు అగ్రికల్చర్ : కర్నూలు శివారులోని 220 కేవీ సబ్‌స్టేషన్‌లో ఆధునికీకరణ పనులను ఏపీ ట్రాన్స్‌కో అధికారులు ఒక్కరోజులోనే పూర్తి చేశారు. రూ.40 లక్షల వ్యయంతో ఈ పనులు చేపట్టారు. ఏపీ ట్రాన్స్‌కో సీఈ మోహన్‌రావు, ఎస్‌ఈలు కృష్ణ కుమార్, రామ కృష్ణ, ఏపీఎస్పీ డీసీఎల్ ఎస్‌ఈ ఉమాపతి పర్యవేక్షణలో విద్యుత్ సిబ్బంది ఉదయం నుంచి రాత్రి 9 గంటల వరకు శ్రమించారు. దీంతో ఆదివారం నుంచి వ్యవసాయానికి పగటిపూటనే మరింత నాణ్యమైన విద్యుత్ ఇచ్చే అవకాశముందని ఏపీఎస్పీ డీసీఎల్ ఎస్‌ఈ ఉమాపతి తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈ సుభాష్ గౌడ్, ఏడీఈ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

టీబీ డ్యాంలో 10.128 టీఎంసీలు

హొళగుంద: కర్ణాటక రాష్ట్రం హొస్పేట్ వద్ద నిర్మించిన తుంగభద్ర డ్యాంలో నీటి నిల్వ నిలకడగా ఉంది. 1,633 అడుగులకు గాను శనివారం 1588.89 అడుగుల వద్ద 105.788 టీఎంసీల పూర్తి సామర్థ్యానికి గాను 10.128 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గతేడాది ఇదే సమయానికి 1619.59 అడుగుల వద్ద 60.187 టీఎంసీల నీరు నిల్వ ఉండేది. డ్యాంలో నీటి నిల్వ తక్కువగా ఉండడంతో గత నెల 25న ఎల్లెల్సీకి నీటి సరఫరాను నిలిపి వేసిన టీబీ బోర్డు అధికారులు తాగునీటి అవసరాల కోసం ఆదివారం వంద క్యూసెక్కులు విడుదల చేయనున్నారు.

అయోధ్య మందిరంలో రామాయణం



ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య రామ మందిరం ప్రాణప్రతిష్ఠ సందర్భంగా నంద్యాలకు చెందిన ప్రముఖ చిత్రకారుడు చింతలపల్లె కోటేష్ రామాయణ సూక్ష్మచిత్రాలతో అయోధ్య రామమందిరాన్ని గీచి అబ్బురపరిచారు. ఏ3 డ్రాయింగ్ షీట్‌పై ఒకే చిత్రంలో రామాయణంలోని ముఖ్యమైన ఘట్టాలు, సూక్ష్మ చిత్రాలతో అయోధ్య రామమందిరాన్ని చిత్రించారు. ఇందులో రాముని జననం నుంచి సీతాదేవి అగ్ని ప్రవేశం తదితర ఘట్టాలను ఆవిష్కరించారు. ఈ నెల 22న అయోధ్యలో రామ మందిరం ప్రారంభించనున్న సందర్భంగా ఈ చిత్రాన్ని గీచినట్లు కోటేష్ తెలిపారు. – నంద్యాల(అర్బన్)

రోడ్డు భద్రత అందరి బాధ్యత

- జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ సృజన

కర్నూలు(సెంట్రల్): రోడ్డు భద్రత అందరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని తన చాంబరులో రహదారి భద్రతా మాసోత్సవాలకు సంబంధించిన పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జనవరి 20 నుంచి ఫిబ్రవరి 19వ తేదీ వరకు రోడ్డు భద్రతా మాసోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలన్నారు. సెక్షన్ 129 ప్రకారం ద్విచక్ర వాహనం నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాల్సి ఉందన్నారు. కారులో ప్రయాణించే వారు సీటు బెల్టు ధరించాలన్నారు. రోడ్డు భద్రత నియమాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీటీసీ శ్రీధర్‌రెడ్డి, ట్రాఫిక్ డీఎస్పీ నాగభూషణం, ఆర్‌టీఓ రమేష్, డీఎంహెచ్‌ఓ రామగిడ్డయ్య, ఆర్ అండ్‌బీ అధికారులు పాల్గొన్నారు.

ఆడపిల్లలపై వివక్ష చూపొద్దు

కర్నూలు(అర్బన్): తల్లిదండ్రులు ఆడపిల్లలపై వివక్ష చూపకుండా మంచి విద్యను అందించి వారి అభ్యున్నతికి తోడ్పడాలని జిల్లా కలెక్టర్ సృజన అన్నారు. శనివారం తన చాంబర్‌లో జాతీయ బాలికా వారోత్సవాల్లో భాగంగా ' ఆడపిల్లను రక్షించండి ... ఆడపిల్లను చదివించండి ' అనే కార్యక్రమానికి సంబంధించిన స్టిక్కర్లు, ప్రతిజ్ఞ కరపత్రాలను ఆమె ఆవిష్కరించారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జాతీయ బాలికా వారోత్సవాలను ఈ నెల 24వ తేదీ వరకు నిర్వహించాలని సూచించారు. లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించినా, భ్రూణ హత్యలకు పాల్పడినా చట్టపరంగా చర్యలు తీసుకకోవడం జరుగుతుందని ఆమె హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా మహిళా, శిశు సంక్షేమ సాధికారత అధికారిణి పీ వెంకటలక్షుమ్మ, డీసీపీఓ శారద, శ్రీలక్ష్మి, కోఆర్డినేటర్ సుంకన్న, పద్మ తదితరులు పాల్గొన్నారు.

మద్యం అక్రమ విక్రయాలపై దాడులు

బొమ్మలసత్రం: నంద్యాల జిల్లా వ్యాప్తంగా రెండు రోజులుగా సెబ్‌అధికారులు మద్యం అక్రమ విక్రయదారులపై దాడులు నిర్వహించారు. అలాగే నాటుసారా స్థావరాలపై జరిపిన దాడుల్లో 13 మందిపై కేసులు నమోదు చేసి 91 లీటర్ల సారా, 600 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. ఇతర రాష్ట్రాల నుంచి మద్యం తెచ్చి విక్రయించే వారిపై జరిపిన దాడుల్లో ఏడుగురిపై కేసు నమోదు చేసి వారి నుంచి 347 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. అక్రమంగా తరలిస్తున్న 160 రేషన్ బస్తాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ పేర్కొన్నారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.

నిరుపయోగ చెక్‌బుక్‌లకు పంచనామా



చెక్కులకు అగ్గి పెడుతున్న దృశ్యం

కర్నూలు(సెంట్రల్): కలెక్టరేట్‌లోని జిల్లా ఖజానా శాఖ స్ట్రాంగ్ రూమ్‌లో నిరుపయోగంగా ఉన్న చెక్ బుక్కులకు జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య సమక్షంలో పంచనామా నిర్వహించారు. కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలోని షటి ల్ కోర్టులో గుంతను తవ్వించి అందులో జిల్లా ట్రెజరీ, సబ్ ట్రెజరీలలో నిరుపయోగంగా ఉన్న 2071 చెక్కుబుక్కులను వేయించి అగ్గిపెట్టారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జీఓ నంబర్ 135ను అనుసరించి నిరుపయోగంగా ఉన్న సేఫ్ ఆర్టికళ్లను ధ్వంసం చేసేందుకు చర్య లు తీసుకుంటున్నట్లు జేసీ నారపురెడ్డి మౌర్య చెప్పారు. కార్యక్రమంలో డీఆర్వో కె.మధుసూదన్‌రావు, ఖజానా శాఖ డీడీ రామచంద్రరావు, జిల్లా అగ్నిమాపక అధికారి వెంకటరాముడు, ఏటీఓలు జయలక్ష్మి, సుబ్బారాయుడు, స్ట్రాంగ్ రూమ్ ఎస్టీఓ కరుణాకర్, సునీల్ పాల్గొన్నారు.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.